క్లుప్తంగా

విద్యార్థులకు అవగాహన



ఏటూరునాగారం: విపత్తులు సంభవించిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు ఎన్‌డీఆర్‌ఎఫ్ పదవ బెటాలియన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రైతు వేదిక లో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ప్రభుత్వ జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీ గురుకుల జూనియర్ కాలేజీ విద్యార్థులు హాజరు కాగా పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ టీమ్ ఇన్‌స్పెక్టర్ భూపేంద్ర కుమార్, ఎస్సై నరేందర్ సింగ్, బెటాలియన్ టీమ్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి గాను సింగ్, జూనియర్ కాలేజీ ప్రిన్స్‌పాల్ భవద్గీత వసంతర, డీటీ రాజేశ్వరావు ఉన్నారు.

నివాళి



ములుగు రూరల్: మండలంలోని జగ్గన్నపేట పంచాయతీ పరిధి అన్నంపల్లి గ్రామానికి చెందిన పోరిక రాధాబాయి అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని గ్రంథాలయ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ బుధవారం పరామర్శించారు. రాధాబాయి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రమేష్, మంజినాయక్, దశరథ్, సమ్మలాల్, రామ్‌లాల్, తదితరులు ఉన్నారు.

ట్రాక్టర్ పైనుంచి పడి వ్యక్తి మృతి

ఎస్ఎస్‌తాడ్వాయి: ట్రాక్టర్ పైనుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కాల్వపల్లి తుమ్ముల వాగు బ్రిడ్జి వద్ద చోటు బుధవారం చేసుకుంది. తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి వివరాల ప్రకారం.. గోవిందరావుపేట మండలంలోని పస్రాకు చెందిన తిప్పారపు రఘు (45) ట్రాక్టర్‌పై పక్కన కూర్చుని వెళ్తుండగా కాల్వపల్లి తుమ్మల వాగు బ్రిడ్జి దాటిన తర్వాత ట్రాక్టర్‌పై నుంచి ప్రమాదవశత్తుగా కింద పడి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, భారత న్యాయ సంహిత కొత్త చట్టం 106(2) సెక్షన్ కింద ట్రాక్టర్ డ్రైవర్‌పై తొలి కేసు నమోదు అయినట్లు పేర్కొన్నారు.

ఫొటోగ్రాఫర్ ఆత్మహత్య

కాటారం: ఆర్థిక ఇబ్బందులతో ఫొటోగ్రాఫర్ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలోని గారెపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గారెపల్లికి చెందిన దిండు రవి(40) పాటోగ్రాఫర్‌గా జీవనం కొనసాగించేవాడు. రవి కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్యం నిమిత్తం ఖర్చుల పాలయ్యాడు. ఇటీవల నూతన ఇళ్లు నిర్మించుకోగా ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. వైద్యం, ఇంటి నిర్మాణం కోసం రూ.12 లక్షల మేర అప్పు అయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆర్థిక సమస్యలతో వారం రోజులుగా రవి మథనపడినట్లు వారు పేర్కొన్నారు. ఈ క్రమంలో తీవ్ర మనస్థాపానికి గురైన రవి మండలంలోని నస్తూర్‌పల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో ఓ చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అటువైపుగా వెళ్లిన వారు గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. భార్య శ్రీలత ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మ్యాక అభినవ్ తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి..

టేకుమట్ల: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కలికోటలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలంలోని శ్రీరాములపల్లికి చెందిన గుత్తికొండ రాము (32) కొన్ని సంత్సరాలుగా హైదరాబాద్‌లో కిరాణం సాను నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కొన్ని నెలలుగా కిరాణం నష్టాల్లో ఉండగా హైదరాబాద్ నుంచి అతడి భార్య తల్లిగారిల్లు అయిన భూపాలపల్లి పట్టణానికి కుటుంబంతో వచ్చాడు. కొన్ని రోజులుగా భార్య భర్తల మధ్య గొడవలు జరుగడంతో మే 18న మృతుడి భార్య గౌతమి భర్త రాముపై భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా గృహ హింస చట్టం కేసు నమోదు చేసి, కౌన్సెలింగ్ సైతం చేశారు. దాంతో తీవ్ర మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరికి చెప్పకుండా మండలంలోని కలికోటపల్లి తన మేనమామ ఆడెపు శ్రీనివాస్ ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో ఇంట్లో ఉరి వేసుకోగా గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించినట్లు తెలిపారు. కాగా, మృతుడి తండ్రి సంపత్ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోగికారి ప్రసాద్ తెలిపారు. కానీ, రాము ఆత్మహత్యకు భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న పోలీసులే కారమని సూసైడ్ నోట్‌లో రాసిపెట్టుకున్నట్లు ప్రచారం జరుగుతుంది.

అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దు



గోవిందరావుపేట: మాట్లాడుతున్న సీఐ రవీందర్



ఏటూరునాగారం: గొత్తికోయలతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

గోవిందరావుపేట: అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దని పస్రా సీఐ రవీందర్, ఎస్సై కమలాకర్ అన్నారు. పస్రా పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవునిగుట్ట గుత్తికోయగూడెంను బుధవారం వారు సందర్శించి మాట్లాడారు. ఎవరైన కొత్త వ్యక్తులు గ్రామానికి వస్తే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాలప్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దేవునిగుట్ట గొత్తికోయగూడెం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న వానాకాలం దృష్ట్యా వరదలు సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మావోయిస్టుల ఫొటోలతో కూడిన వాల్‌పోస్టర్లు గ్రామంలో అంటించారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ఏటూరునాగారం: గొత్తికోయగూడేల్లోని గిరిజనులు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్ అన్నారు. బుధవారం మండలంలోని చెల్పాక, అల్లంవారిఘణపురం, పాలకమ్మ వాగు గొత్తికోయగూడేల్లోని ప్రజలతో వారు మాట్లాడారు. అడవి ప్రాంతాల్లోని ప్రజలు అపరచిత వ్యక్తులకు ఎలాంటి సాయం చేయొద్దన్నారు. కొత్త వ్యక్తులు వస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. అడవులను కాపాడుకోవాలని సూచనలు చేశారు. వన్యప్రాణులను వేటాడడం చట్టరీత్యా నేరమన్నారు. ప్రజల ఆరోగ్య పరిస్థితి, గర్భిణుల వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులు ఉన్నారు.

జిల్లా పేరు మార్పుపై గ్రామ సభలు



వాజేడు: గ్రామ సభ నిర్వహిస్తున్న అధికారులు



వెంకటాపురం(కె)లో..

వాజేడు: మండల పరిధిలోని ఎడుచర్ల పల్లి, ప్రగళ్లపల్లి, దూలాపురం, పూసూరు, గుమ్మడిదొడ్డి, చీకుపల్లి, చెరుకూరు, అయ్యావారిపేట, పేరూరు, చంద్రుపట్ల, టేకులగూడెం, కృష్ణాపురం, పెద్దగొల్లగూడెం గ్రామ పంచాయతీల్లో బుధవారం గ్రామ సభలు నిర్వహించారు. జిల్లా పేరును సమ్మక్క–సారలమ్మ ములుగు జిల్లాగా మార్పుపై ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. ఈ గ్రామ సభల్లో ప్రజలు జిల్లా పేరు మార్పునకు అనుకూలంగా తీర్మానం చేశారు.

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని మేజర్ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ములుగు జిల్లా పేరును సమ్మక్కసారలమ్మ ములుగు జిల్లాగా పేరు మార్చాడానికి ప్రజాభి ప్రయా సేకరణ గ్రామ సభను ఎంపీఓ హనుమంతరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ గ్రామ సభలో జిల్లా పేరును మార్పుటకు గ్రామస్తులు ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

న్యాయం జరిగేలా చూడాలి



అడ్వకేట్లతో మాట్లాడుతున్న కార్మికులు



వాగ్వాదం చేసుకుంటున్న పర్మనెంట్, కాంట్రాక్ట్ కార్మికులు

మంగపేట: మండలంలోని కమలాపురం మూతపడిన బిల్ట్ కార్మికుల వేతన సెటిల్‌మెంట్ న్యాయబద్ధంగా అర్హులైన ప్రతి కార్మికుడికి పారదర్శకంగా న్యాయం జరిగేలా చూడాలని సీనియర్ కార్మికులు కోరారు. కమలాపురం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో పీఎఫ్, నాన్ పీఎఫ్ కార్మికులు వారి కుటుంబాలతో పాల్గొన్నారు. ఈ సమావేశానికి హాజరైన హైకోర్టు అడ్వకేట్లకు బిల్ట్ యజమాన్యం ద్వారా జరిగిన వేతన ఒప్పందంలో తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. ఫ్యాక్టరీనే నమ్ముకుని 30 ఏళ్ల నుంచి రాత్రి పగలు తేడా లేకుండా ఫ్యాక్టరీని లాభాల బాటలో నడిపినట్లు తెలిపారు. అయిన కార్మికులకు చివరకు వేతన సెటిల్‌మెంట్ కార్మిక చట్టాలకు విరుద్ధంగా జరిగిందని దీంతో తమ కుటుంబాలు తీరని అన్యాయం జరిగిందని వాపోయారు. ఇదిలా ఉండగా సమావేశానికి కాంట్రాక్ట్ కార్మికులు హాజరై తమ కూడా పర్మనెంటు కార్మికులతో సమానంగా శ్రమించిన తమకు ఎలాంటి న్యాయం జరుగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం పర్మనెంటు కార్మికులకే న్యాయం చేయాలనే విధంగా సమావేశం నిర్వహించడం ఎంత వరకు సమంజసమన్నారు. ఫ్యాక్టరీలో పనిచేసిన ప్రతి కార్మికుడిని న్యాయం జరిగేలా చూడాలని కోరుతూ కాంట్రాక్టు కార్మికులు, వారి కుటుంబ సభ్యులు వాగ్వాదానికి దిగడంతో సమావేశం మధ్యలోనే ముగిసింది. ఈ సందర్భంగా ఫ్యాక్టరీలో కార్మికులకు జరిగిన అన్యాయాన్ని తాము తెలుసుకునేందుకు మాత్రమే వచ్చామని ఫ్యాక్టరీ ముతపడిన నాటి నుంచి కార్మికులకు ఫ్యాక్టరీ యజమాన్యం మధ్య జరిగిన ప్రతి అంశాన్ని పరిగణలోకి తీసుకుని అందరికి చట్టపరంగా న్యాయం జరిగే విధంగా కృషి చేస్తామని అడ్వకేట్లు తెలిపారు.

‘రైతు భరోసా’పై అభిప్రాయాల స్వీకరణ



మంగపేట: మాట్లాడుతున్న డీసీఓ సర్దార్‌సింగ్



వెంకటాపురం(ఎం): మాట్లాడుతున్న గోపాల్‌రావు

మంగపేట: మండల కేంద్రంలోని రైతువేదిక కార్యాలయంలో రైతు భరోసా పథకం అమలుపై సలహాలు సూచనలు సేకరించేందుకు మంగపేట ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ తోట రమేశ్ అధ్యక్షతన సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న రైతులకు ప్రభుత్వ ముఖ్య ఉద్దేశాన్ని జిల్లా సహకార అధికారి సర్దార్ సింగ్ వివరించారు. అనంతరం రైతుల అభిప్రాయాలు, సూచనలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ చేరాలు, సహకార సంఘం సీఈఓ జగన్నాథరావు, సంఘం వైస్ చైర్మన్ కాడబోయిన నరేందర్, మాజీ జెడ్పీటీసీ వైకుంఠం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి, డైరెక్టర్లు, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

వెంకటాపురం(ఎం)లో..

వెంకటాపురం(ఎం): సాగు భూములన్నింటికీ రైతు భరోసా ఇవ్వాలని లక్ష్మీదేవిపేట పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ ఎర్రబెల్లి గోపాల్‌రావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని లక్ష్మీదేవిపేట రైతు వేదికలో ఏడీఏ శ్రీపాల్ అధ్యక్షతన రైతు భరోసా పథకంపై రైతుల నుంచి సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడుతూ.. రైతు భరోసా పథకాన్ని కౌలు రైతులకు, పోడు రైతులకు వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం ఏడీఏ శ్రీపాల్ మాట్లాడుతూ.. రైతుల నుంచి తీసుకున్న సలహాలు, సూచనలు ప్రభుత్వానికి నివేదించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ మేరుగు కళ్యాణి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ తండా నాగేష్, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో వైద్యశిబిరాలు



కమలాపురంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి వైశాలి

మంగపేట: మండలంలోని మంగపేట, బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రాఆమల్లో ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారి వైశాలి, నిఖిల్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలను నిర్వహించారు. మంగపేట పీహెచ్‌సీ పరిధిలోని కమలాపురం అల్లూరిసీతారామరాజు వీధిలో వైద్య శిబిరం నిర్వహించి బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ పరిధిలోని లక్ష్మీనార్సాపురంలో వైద్యాధికారి నిఖిల్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు కాచి వడపోసి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఎలాంటి అనారోగ్య లక్షణాలు కనిపించినా వెంటనే స్థానిక ఆశవర్కర్లు, ఏఎన్ఎం సహకారంతో సమీప పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించుకుని మెరుగైన వైద్యం పొందాలన్నారు.

‘సమాచారం ఇవ్వండి.. బహుమతి పొందండి’



పోస్టర్లు అంటిస్తున్న ఎస్సై టీవీఆర్ సూరి

మంగపేట: మావోయిస్టుల సమాచారం ఇచ్చి నగదు బహుమతి పొందాలని ఎస్సై టీవీఆర్ సూరి అన్నారు. మండలంలోని పాయిగూడెం, కత్తిగూడెం, రాజుపేట, దోమెడ, పూరేడుపల్లి, శనిగకుంట తదితర గ్రామాల్లో బుధవారం సాయంత్రం మావోయిస్టుల ఫొటోలతో కూడిన వాల్ పోస్టర్లను అంటించారు. పోస్టర్లలో ముద్రించిన మావోయిస్టుల సమాచారం ఇచ్చిన వారికి రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు నగదు బహుమతి అందిస్తామన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు బయటకు రాకుండా గోప్యంగా ఉంచుతామన్నారు.

వ్యాధుల నివారణపై అవగాహన కల్పించాలి



రిజిస్టర్ తనిఖీ చేస్తున్న పోరిక రవీందర్

ఎస్ఎస్‌తాడ్వాయి: సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని మలేరియా, టీబీ, ఎయిడ్స్ జిల్లా అధికారి పోరిక రవీందర్ వైద్య సిబ్బందికి సూచించారు. బుధవారం మండలంలోని కొడిశాల పీహెచ్‌సీని ఆయన సందర్శించారు. కేసుల నమోదు, రోగుల ఓపీ రిజిస్టర్లలను తనిఖీ చేశారు. డెంగీ, మలేరియా వంటి జ్వరాలను నియంత్రించాలని సిబ్బందికి సూచించారు. వైద్య సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. సకాలంలో రక్త పరీక్షలు చేయాలని వైద్యాధికారి గౌతమ్‌కు సూచించారు. ల్యాబ్, ఫార్మాసీ గదులను పరిశీలించారు. కొడిశాలలోని ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా వంటి వ్యాధుల గూర్చి అవగాహన సదస్సు నిర్వహించి ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అసిస్టెంట్ ఆఫీసర్ దుర్గారావు, ఏఎన్ఎం అనురాధ ఉన్నారు.

ప్రజలకోసం పనిచేస్తే గుర్తింపు



గణపురం: పదవీకాలం పూర్తయిన ఎంపీటీసీ సభ్యులతో ఎమ్మెల్యే గండ్ర



మహాముత్తారం: వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ శారద

గణపురం: ప్రజాప్రతినిధులుగా గెలుపొందిన వారు ప్రజలకోసం పని చేస్తే ప్రజలు మళ్లీ మళ్లీ గుర్తింపును ఇస్తారని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కావటి రజిత అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండల పరిషత్ పాలక సభ్యుల పదవి కాలం ముగియడంతో సభ్యులను ఆయన సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర, దేశ స్థాయి వరకు ప్రజల చేతిలో గెలుపొందిన పాలకులు సేవకులుగా మారి సుపరిపాలన అందిస్తేనే అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మహాముత్తారం: ఐదు సంవత్సరాలుగా ప్రజాక్షేత్రంలో పనిచేసిన ప్రజాప్రతినిధులను ఆయా శాఖల అధికారులు బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ శారద మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాల పదవీ కాలంలో మండలంలోని పలు రకాల అభివృద్ధి పనులు చేపట్టామని గ్రామాల అభివృద్ధి కోసం ఐటీ పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అండదండలతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలను సంరక్షించాలి



మొక్క నాటుతున్న పస్రా ఎస్సై కమలాకర్

గోవిందరావుపేట: ప్రతి ఒక్కరూ మొక్కలను సంరక్షించాలని పస్రా ఎస్సై కమలాకర్ అన్నారు. పస్రా పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రాజెక్ట్ నగర్ గ్రామాన్ని ఆయన సందర్శించి గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. మొక్కలు ఉంటేనే మనిషి మనుగడ సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ మాజీ సర్పంచ్ సమ్మయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి



మాట్లాడుతున్న కోటి

ములుగు రూరల్: నీట్ పరీక్షల అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి డిమాండ్ చేశారు. బుధవారం విశ్రాంత ఉద్యోగుల భవనంలో విద్యార్థి, యువజన సంఘాలు (ఎన్ఎస్‌యూఐ), (ఎస్ఎఫ్ఐ) (డీవైఎఫ్ఐ), ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీట్ పరీక్షల లీకేజీపై ప్రధాని నరేంద్రమోదీ నిర్లక్ష్యపు వైఖరికి నిదర్శనమని అన్నారు. నీట్ పరీక్షల లీకుల కారణంగా తెలంగాణ రాష్ట్ర విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న బీజేపీ ఎంపీల తీరును నిరసిస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో దేశ వ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చామని అన్నారు. పది సంవత్సరాలుగా బీజేపీ హయాంలో టెస్టింగ్ ఏజెన్సీల పరీక్ష నిర్వహణలో పూర్తిగా విఫలమైందని అన్నారు. పాఠశాలల బంద్‌కు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమ్మరి సాగర్, రత్నం ప్రవీణ్, తోకల రవి తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై చర్య తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లేష్

చిట్యాల: చిట్యాల, టేకుమట్ల మండలాలల్లో విచ్చలవిడిగా గుడుంబా అమ్ముతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని అలాంటి అధికారులపై చర్య తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మారెపెల్లి మల్లేష్, వీసీకే పార్టీ ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జ్ అంబాల అనిల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో గుడుంబాను ప్యాకెట్లలో సరఫరా చేస్తూ అమ్ముతున్న కనీసం సంబంధిత అధికారులకు కనబడడం లేదా అని ప్రశ్నించారు. బహాటంగా అమ్ముతున్న ఎవరు పట్టించుకోకపోవడం పలు విమర్శలకు దారి చూపుతుందన్నారు. సంబంధిత అధికారులకు తెలిసే ఇలా చేస్తున్నారని అలాంటి అధికారులను సస్పెండ్ చేయాలని వారు ఉన్నాతాధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాని, చింటూ, అక్షయ్, కుమార్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

రసాయన శాస్త్రంలో కాటారం వాసి పరిశోధన



పరిశోధన పత్రం అందుకుంటున్న కార్తీక్

కాటారం: మండల కేంద్రానికి చెందిన బొక్కల కార్తీక్ రసాయన శాస్త్రంలో అరుదైన పరిశోధన చేసి చైతన్య డీమ్డ్ టూ బీ యూనివర్సిటీ ద్వారా బుధవారం అభినందనలు అందుకున్నారు. కార్తీక్ రసాయన శాస్త్ర విభాగంలో సింథసిస్ ఆఫ్ సమ్ న్యూ ఐసోక్జాబోల్ లింక్డ్ హెటిరోసైకిల్స్ అండ్ థెయిర్ బయోలాజికల్ స్క్రీనింగ్ అనే అంశంపై ప్రొఫెసర్ సతీశ్‌కుమార్ నూకల పర్యావేక్షణలో పరిశోధన చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ ఆచార్య ఆర్.క్రిస్టోఫర్ పరిశోధనపై హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపినట్లు కార్తీక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సాత్వికరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య సుందర్‌రామ్, డీన్ అడ్మినిస్ట్రేషన్ ఆచార్య రాజు, ఇతర అధ్యాపకులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మొగుళ్లపల్లి: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు క్యాతరాజు రమేశ్ కొంత కాలంగా అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స చేయించుకొని ఇంటి వద్ద విశాంత్రి తీసుకుంటున్నాడు. దీంతో రమేశ్‌ను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు బుధవారం పరామర్శించారు. ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని అన్ని విధాలుగా సహయ సహకారాలు అందిస్తానన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు పోల్నేని లింగరావు, ఆకుతోట కుమారస్వామి, తక్కళ్లపెల్లి రాజు, ఎమ్‌డి రఫీ, ఎలేటి నర్సింహారెడ్డి, మోహన్‌రెడ్డి, మధుకర్, నీల రాజు తదితరులు ఉన్నారు.

కోర్కిశాలలో..

మండలంలోని కోర్కిశాల గ్రామానికి చెందిన ఓరుగంటి బ్రహ్మం గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని జెడ్పీటీసీ సదయ్య, మాజీ సర్పంచ్ రాములు బుధవారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.